

రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించాలి : సిపిఎం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

భూ సమస్యలు పరిష్కరించే విధంగా జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడాన్ని సిపిఎం అన్నమయ్య జిల్లా కమిటీ స్వాగతిస్తుందని తెలిపారు. రెవెన్యూ సదస్సులు నామ మంత్రంగా కాకుండా భూ సమస్యలు పరిష్కరించే విధంగా నిర్వహించాలని కోరారు. ఇందుకు సిపిఎం తరపున సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలు గ్రామాల ప్రజలు తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారని అన్నారు. సమస్యలను గ్రామాల వారిగా విభజించి ఆ సమస్యలు పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని గ్రామాలలో భూ సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ రెవెన్యూ కార్యాలయల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ఇలాంటి సమస్యలు పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. వివిధ గ్రామాలలో రసీదులు ఇవ్వడానికి తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు.

'ఉక్కు'కు సమాధి!

- కేంద్రంలోని బిజెపి సర్కారు ఝలక్
- చీమకుట్టిన దొంగలుగా ప్రధాన పార్టీలు
- స్థానిక బిజెపి ఎమ్మెల్యేకు పట్టని వైనం
- ప్రజాసంఘాల నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీకి కేంద్రంలోని బిజెపి సర్కారు సమాధి కట్టింది. 2014లో రాష్ట్ర విభజన సమయంలో అప్పటి యుపిఎ-2 సర్కారు జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలనే పార్లమెంట్ సాక్షిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. 2014 సార్వత్రిక ఎన్నికల అనంతరం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి పలురకాల సర్వేలు, టాస్క్‌ఫోర్స్‌ల అధ్యయనాల పేరుతో నటించింది. 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశం ప్రధాన అజెండాగా మారింది. జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గ ప్రజానీకం బిజెపి అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డిని గెలిపించి గురుబాధ్యతను కట్ట బెట్టింది. 2014 నుంచి 2024 వరకు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసిపి, కూటమి భాగస్వామిగా మారిన టిడిపి ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని హామీలిచ్చి మరోసారి చీమకుట్టిన దొంగల్లా వ్యవహరించాయి. మంగళవారం జనసేన ఎంపీ పార్లమెంట్‌లో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశంపై అడిగిన ప్రశ్నకు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశం పరిశీలనలో లేదని పేర్కొనడం చర్చ నీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి ప్రకటనపై బిజెపి ఎమ్మెల్యే, కూటమి తరు పున గెలిచిన ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో చలనం లేక పోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. కేంద్రంలోని ప్రతిపక్ష నేతలు ఇండియా కూట మి అధికారంలోకి వస్తే కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ని అమలు చేసి తీరుతామని స్పష్టం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇండియా కూట మికి సాధ్యమయ్యే ఉక్కు పరిశ్రమ ఎన్డీయేకు ఎందుకు సాధ్యం కాదో చెప్పడం లేదు. దీనిపై రాష్ట్రం, జిల్లాలోని కూటమి ప్రజాప్రతినిధుల్లో చలనం లేకపోవడం విస్మయాన్ని



2019లో కడప ఉక్కు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జగన్ (ఫైల్‌ఫొటో)

కలిగిస్తోంది. జిల్లా ప్రజానీకం మేల్కొనాల్సిన అవసరం ఏర్ప డింది. కూటమిలోని భాగస్వామ్య పక్షాలైన బిజెపి, టిడిపి, జనసేన నాయకత్వాలు ప్రజా నీకానికి స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేని పక్షం లో జిల్లా ప్రజానీకం తమకు ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడానికి ఉమ్మ డిగా కలిసి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

కేంద్రం అబద్ధాల కోరు

ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఫీజులబులిటీ లేదనడం పచ్చి అబద్ధం. ఐరన్‌ఓర్‌తో పాటు ఉక్కు తయారీలో కీలక పాత్ర పోషించే సున్నం, నికెల్, డోలమైట్ వంటి కీలక మూలకాలు సైతం జిల్లాలో లభ్యమవుతున్నాయి. దేశంలో ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో ఐరన్‌ఓర్ లేదని గమనించాలి. ప్రభుత్వం అబద్ధాలు చెబుతోంది.

- జి.చంద్రశేఖర్, ఉక్కుసాధన కమిటీ కన్వీనర్, కడప.

ఫీజుబులిటీ పేరుతో ద్రోహం

ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడానికి ఫీజుబులిటీ లేదనే పేరుతో కేంద్రంలోని బిజెపి సర్కారు ద్రోహం చేస్తోంది. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన ప్రధాన హామీకి నిలువునా తూట్లు పొడిచారు. జిల్లాలో పరిశ్రమను ఏర్పాటు చేయడానికి వయ బులిటీ లేదనడం దారుణం.

- గాలి చంద్ర, రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు, కడప.

రెవెన్యూ సదస్సులకు సహకరించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

రెవెన్యూ సదస్సులపై రాజకీయ పార్టీలు ప్రజలకు అవగాహన కల్పించి సదస్సులను విజయవంతమయ్యేలా సహకరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని విసి హాల్లో రెవెన్యూ సదస్సులపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నిర్వహించబోయే రెవెన్యూ సదస్సులపై అభిప్రాయాలు, సూచనలను ఇవ్వాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులను నిర్వహించడం చాలా మంచి పరిణామమని, భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల సమస్యలు తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కొన్నిచోట్ల భూ ఆక్రమణలు, బలవంతంగా భూములు లాక్కోవడం వంటి సమస్యలున్నాయని, వీటిని కూడా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను వివిధ పార్టీల ప్రతినిధులు కోరారు. ప్రయివేటు భూముల సమస్యలు కుటుంబ సమస్యలుగా ఉంటాయని వాటిని రెవెన్యూ సదస్సులలో ఇవ్వవచ్చునని కలెక్టర్‌ను అడగగా, కుటుంబ సమస్యలు ఆ కుటుంబం వారే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల తరపున వాలంటీర్లను ఏర్పాటు చేసి ప్రజలకు సహకరిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 501 గ్రామపంచాయతీలలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని ఈ సదస్సుల గురించి ప్రజాప్రతినిధులు ప్రజలందరికీ తెలియజేసి విజయవంతం చేయాలని కోరారు. భూ సమస్యలను సదస్సులోనే పరిష్కరించేలా చేయడమే రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమని ఎటువంటి సమస్య ఉన్నా రెవెన్యూ సదస్సుకు ప్రజలు రావచ్చని తెలిపారు. సదస్సుల ఏర్పాటుకు అన్ని రకాల చర్యలు చేపట్టామని తెలిపారు. ఇన్‌కం సర్టిఫికెట్, మ్యుటేషన్ లాంటి రెవెన్యూ సేవలకు సదస్సు నిర్వహించబోయే రోజు ఆయా రెవెన్యూ సేవ ఉచితంగా అందించబడుతుందని సందర్భంగా తెలిపారు. అటువంటి రెవెన్యూ సేవలకు సదస్సు నిర్వహించబోయే రోజు కాకుండా మిగతా రోజులలో సర్వీస్ ఛార్జ్ ఉంటుందని తెలిపారు. సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జగన్మోహనరాజు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, జెసి ఆదర్శ రాజేంద్రన్, డిఆర్‌ఒ మధుసూదనరావు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నా భర్త మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

- వర్షంలోనూ రోడ్డుపై బైఠాయించి ఉపాధ్యాయుడి సతీమణి నిరసన
- ఉపాధ్యాయులు, సంఘాల నాయకుల సంఘీభావం



ప్రభుత్వాస్పత్రి వద్ద బైఠాయించి వర్షంలోనూ నిరసన చేస్తున్న మృతుడి సతీమణి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

తన భర్త మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని మృతి చెందిన ఉపాధ్యాయుడు ఎజాస్ అహమ్మద్ సతీమణి గురువారం రోడ్డుపై బైఠాయించి వర్షంలో నిరసన తెలియజేశారు. రాయచోటి ప్రభుత్వాస్పత్రిలో ఉపాధ్యాయుడు అహమ్మద్ మృతదేహాన్ని వైద్యులు పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామమైన కడపకు తరలిస్తుండగా మృతి చెందిన ఉపాధ్యాయుడి సతీమణి రెహిమూన్ బేగం తన కుటుంబ సభ్యులు, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నాయకులతో కలిసి జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అంబులెన్స్‌కు అడ్డంగా కూర్చొని తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడ నుండి కదలనంటూ నిరసనకు దిగారు. తన భర్తను అన్యాయంగా కొట్టి చంపేశారు అంటూ బోరునా విలపించింది. దీన్నంతటికి కారణం స్కూల్ టీచర్లే అంటూ ఆరోపించింది. 'కొట్టండి మేము చూసుకుంటాం' అని టీచర్లు ప్రోత్సహించడం వల్లే తన భర్తపై విద్యార్థులు దాడి చేసి అన్యాయంగా చంపేశారంటూ ఆరోపించారు. ఇలాంటి టీచర్లకు కఠిన శిక్ష వేయాలంటూ డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడు మృతి పట్ల సంఘీభావ ర్యాలీ

భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు అహమ్మద్ మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసనగా నల్ల బ్యాడ్జిలు ధరించి మొబైల్ టార్చ్‌తో తహశీల్దార్ కార్యాలయం నుండి బంగ్లా సర్కిల్ వరకు ప్రభుత్వ, ప్రయివేట్ ఉపాధ్యాయులు భారీ ర్యాలీ చేపట్టి మనవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ తరగతి గదిలో విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులకు భద్రత కరవైందని తెలిపారు. మృతుని కుటుంబానికి రూ.2 కోట్ల ఆర్థిక సహాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడి కుటుంబాన్ని ఆదుకోవాలి కలెక్టర్‌కు వినతి

పట్టణంలోని కొత్తపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎజాజ్ అహమ్మద్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించి ఉపాధ్యాయుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ గురువారం కలెక్టర్ శ్రీధర్‌ను జిల్లా ఉపాధ్యాయ ఐక్య వేదిక కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సత్ప్రవర్తన లేని విద్యార్థులను క్రమశిక్షణ కోసం మందలిస్తే తరగతి గదిలోనే విచక్షణారహితంగా అతి కిరాతకంగా కొట్టి హత్య చేయడం సభ్య సమాజం ఎంతో సిగ్గుపడవలసిన చర్యన్నారు. ఉపాధ్యాయుడి మృతిపై విచారణ వేసి దోషులను కఠినంగా శిక్షిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు ఎ.శివారెడ్డి, జాబీర్, రెడ్డప్పరెడ్డి, హరిబాబు, శిబాతుర్ రెహమాన్, జక్రియా, మున్వర్ బాషా, ఇలియాస్, రామాంజినేయులు, రియాజ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతిపై విచారణ చేపట్టాలి

పుల్లంపేట : టి.కమ్మపల్లి జడ్‌పి హైస్కూల్‌లో విరామ సమయంలో ఉపాధ్యాయుడు ఎజాజ్ అహమ్మద్ పాఠశాలలోనే మృతి చెందడంపై ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సబిత, ఉపాధ్యాయులు రమణారెడ్డి, బాల నర్సింహులు, ఆసిఫ్ భాష, శేషాద్రి, ప్రమీల పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** ఉపాధ్యాయుడి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో పాఠశాలల ఉపాధ్యాయులు మౌనం పాటించి సంతాపం తెలిపారు. **రామసముద్రం :** ఉపాధ్యాయుడిపై దాడి కేసులో దోషులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి, మండల అధ్యక్షుడు అయూబ్ ఖాన్, ఉపాధ్యాయులు రమాదేవి, సురేష్ గాయత్రి, నరేంద్ర, షాహిర పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి:** ఉపాధ్యాయుడిపై విద్యార్థులు దాడి చేయడం హేయమైన చర్యని ఉపాధ్యాయుల సంఘాల ఐక్యవేదిక నాయకులు మందా నరసింహులు పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎంఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎం.చక్రినాయక్, దేవళంపల్లి ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరాజు, జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రమణమ్మ, ఎపియుఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.నరసింహులు, వైఎస్‌ఆర్‌టిఎ నాయకులు శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** విద్యార్థులలో క్రమశిక్షణ రావాలంటే విద్యా విధానాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమీక్ష చేసి చట్టంలో మార్పు తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉందని ఫ్యాప్టో నాయకులు అన్నారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు పోకల మధుసూదన, సుధాకర్ నాయుడు, నరసింహులు, పురం వెంకటరమణ, మోహన్ రెడ్డి, సుధాకర్, అశోక్, మల్లీశ్వర్ బాబు, సుధాకర్ రెడ్డి, గోపాల్, ఖాజా, హరిబాబు, హరిప్రసాద్ పాల్గొన్నారు. ఉపాధ్యాయుడి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని రూటా రాష్ట్ర ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ ఖాన్, ఎస్.వి.సైన్స్ క్లబ్ సభ్యులు రమేష్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. **రాయచోటి :** ఉపాధ్యాయుడు ఎజాస్ అహమ్మద్ మృతి ఘటనపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారించాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న డిమాండ్ పేర్కొన్నారు. పట్టణంలో డైట్ పాఠశాలలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల దాడిలో ఉపాధ్యాయుడు మృతిచెందారని, ఇంత దారుణమైన ఘటనపై నిజానిజాలు కోసం ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు పట్టణ నాయకులు జాహిద్, జగదీశ్వర్ రెడ్డి, విష్ణువర్ధన్ పాల్గొన్నారు. **పీలేరు:** ఉపాధ్యాయుడు మృతి బాధాకరమని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తెలిపారు. మండల వనరుల కేంద్రం వద్ద ఉపాధ్యాయుడి ఆత్మ శాంతిని కోరుకుంటూ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎస్.శివారెడ్డి, రాష్ట్ర నాయకులు మహేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అక్రమ్‌బాషా, నాయకులు రహత్ బాష, ఎస్‌టియు నాయకులు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



రాయచోటి : ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు

ఉపాధ్యాయుడి మృతి విచారకరం : వైసిపి

ఉపాధ్యాయులు ఎజాస్ అహమ్మద్ అనుమానాస్పద మృతి విచారకరమని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పాఠశాలలో ఈ సంఘటన ఎలా, ఏమి జరిగింది, గత కొద్దిరోజులుగా ఏమి జరుగుతుందో పూర్తి స్థాయిలో విచారించాలన్నారు. విద్యార్థుల దాడిలోనే ఉపాధ్యాయుడు మరణించారని వస్తున్న వార్తలతో సమాజం ఎటుపోతోందన్న ఆందోళన కలుగుతోందన్నారు. ఉపాధ్యాయుడి మృతి సంఘటన పట్ల విద్యాశాఖ, పోలీసులు నిర్లక్ష్యం వహించకుండా వాస్తవాలను ప్రజలకు తెలియచెప్పాలన్నారు. మృతి చెందిన ఉపాధ్యాయుడి కుటుంబానికి శ్రీకాంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



ఇళ్ల పరిసర ప్రాంతాల్లో లార్వాను గుర్తిస్తున్న డాక్టర్ చౌదరి

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులకు అడ్డుకట్ట

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మండలంలోని నగిరిమడుగు పిహెచ్‌సి డాక్టర్ చౌదరి నయీం అన్నారు. గురువారం స్థానిక ఫింగాణి ఫ్యాక్టరీలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండ్ల పరిసరాలను పరిశీలించి, లార్వాను గుర్తించి, తొలగించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణం మార్పుల వలన ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. చేతుల శుభ్రత పాటించాలని, ఇళ్ల పరిసర ప్రాంతాల్లో మురికి నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, మలేరియా సబ్ యూనిట్ అధికారి ముజిబ్ హుస్సేన్, ఎంపిహెచ్‌వో రామాంజులు, వైద్య సిబ్బంది అమృత, తదితరులు పాల్గొన్నారు.

'అన్నమాచార్య' గుర్తింపు రద్దు చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ట్రైనింగ్ ప్లేస్మెంట్ పేర్లతో విద్యార్థుల నుంచి డబ్బులు వసూళ్లు చేసి తమకు డబ్బులు అందలేదన్న నేపంతో విద్యార్థులను మరల డబ్బులు కట్టమని వేధిస్తూ మోసాలకు పాల్పడుతున్న అన్నమాచార్య విశ్వవిద్యాలయం గుర్తింపు రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం అన్నమాచార్య యూనివర్సిటీ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రైనింగ్ ప్లేస్మెంట్ పేరుతో కళాశాల సిబ్బంది ద్వారా తమ వ్యక్తిగత ఖాతాలోకి విద్యార్థుల నుంచి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు కట్టించుకొని సదరు సిబ్బందిని సస్పెండ్ చేసి మరలా ఫీజులు చెల్లించాలని కళాశాల యాజమాన్యం విద్యార్థులను వేధించడం దుర్మార్గమైన చర్యన్నారు. యాజమన్యం ఒత్తిళ్లకు గతంలో అనేకమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్నమాచార్య యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేటి నాగేశ్వర, ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు మదన్మోహన్, సతీష్, అభిరామ్, నాయ కులు వెంకట మహేంద్ర, దిలీప్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పనిలో నైపుణ్యతను పెంచుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చేస్తున్న పనిలో నైపుణ్యతను పెంపొందించుకోవడంతో పాటూ చేతివృత్తులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం పిఎం విశ్వకర్మ యోజన పథకాన్ని తీసుకొచ్చిందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. గురువారం ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన పిఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు, పూలమాలలు తయారు చేసేవారు, దోబీ తదితర 18 రకాల చేతివృత్తి పనుల వారికి ఏడు రోజుల శిక్షణానంతరం ప్రభుత్వం అందజేసే రూ.15 వేలు విలువ చేసే టూల్ కిట్లు ఉచితంగా పొందుతారని పేర్కొన్నారు. రూ.లక్ష రుణం, ఏడు రోజులకుగాను ప్రతిరోజు గౌరవ వేతనంగా రూ.500 కూడా కల్పించనున్నారని పేర్కొన్నారు. చేస్తున్న చేతివృత్తి పనులలో మరింత నైపుణ్యతను మెరుగుపరుచుకోవడంతో పాటూ టెక్నాలజీని సైతం ఉపయోగించుకొని వ్యాపారంలో అభివృద్ధి సాధించాలనే ముఖ్య ఉద్దేశంతో పిఎం ఈ 18 రకాల చేతివృత్తుల వారికి ఈ శిక్షణ ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని చేతివృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషాను డాక్టర్ స్వాతి చక్రపాణి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.



భవన కార్మికులకు వస్తుసామగ్రిని అందిస్తున్న ఎమ్మెల్యే

కార్యక్రమంలో మదనపల్లి భవన నిర్మాణ అసోసియేషన్ ప్రెసిడెంట్ జంగాల శ్రీనివాసులు, నాదెళ్ల శివ, ముసలికుంట నాగయ్య, రామిశెట్టి కృష్ణ, కెవి ఫౌండేషన్ చైర్మన్ టివి రమణ, మంజునాథ్, పిఎం విశ్వకర్మ యోజనకి నమోదు చేసుకున్న 50 మంది భవన నిర్మాణ కార్మికులు, ధాత్రి ఫౌండేషన్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు అడ్డాగా విద్యాలయాలు : పిసిసి

ప్రజాశక్తి - కడప : రాష్ట్రంలో హైస్కూళ్లు, కళాశాలలు వైసిపి పాలనలో మద్యం షాపులుగా, గంజాయి నిలయాలుగా, డ్రగ్స్ కేంద్రాలుగా, అసాంఘిక శక్తుల అడ్డాగా తయారయ్యాయని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని చోట్ల విద్యార్థుల అల్లరిని భరించలేక టీచర్లు ప్రత్యేకించి మహిళా టీచర్లు క్లాసులకు పోవాలంటే భయపడి పోతున్నారన్నారు. విద్యార్థులు అల్లరి చేస్తుంటే మందలించినందుకు ఏజాజ్ అనే ఫిజిక్స్ ఉపాధ్యాయుడిని దాడి చేయడం విచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యా వ్యవస్థలో నైతిక విలువల కోసం సంస్కరణలు చేపట్టాలన్నారు. దేశంలో జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, కనీస అవసరాలు తీర్చలేక పోతున్నారని చెప్పారు. ప్రపంచ ఆకలి సూచికలో 127 దేశాలలో మనది 105వ స్థానంలో ఉందన్నారు. ఈ నేపథ్యం లో ఉన్న సమస్యలు పరిష్కరించకుండా ముగ్గురికి తక్కువ లేకుండా బిడ్డల్ని కనమని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత పిలుపు ఇవ్వడం మూర్ఖత్వం అని వాపోయారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్, కడప అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త బండి జకరయ్య, సత్తార్, సలావుద్దీన్, మల్లెం విజయ భాస్కర్, ప్రసాద్ గౌడ్, మైనుద్దీన్, రఫీక్, సుబ్బారెడ్డి, ఉత్తన్నవినయ్ పాల్గొన్నారు.

మాదిగల కృతజ్ఞత సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- రాయచోటి : విజయవాడలో ఈనెల 10న నిర్వహించే మాదిగల కృతజ్ఞతన సభ జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మాదిగల రిజర్వేషన్ సమితి నాయకులు మద్దిరేవుల రామాంజనేయులు పేర్కొన్నారు. గురువారం ఉదయం ఎన్‌జిఒ ఆవరణలో చలో విజయవాడ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ కార్యచరణ అమలకు సిద్ధమవుతున్నందుకు 29 ఎస్‌సి రిజర్వుడు, అసెంబ్లీ సీట్లను మాదిగలకు కేటాయించి సమ న్యాయం పాటించినందుకు సిఎం చంద్రబాబుకు కృజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు పేరుపోగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు రాయచోటి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - రాయచోటి : సాధారణ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నామని ఎంపిడిఒ వెంకటేష్ పేర్కొన్నారు. సమావేశానికి ఎంపిపి పల్లపు రాజమ్మ అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్యఅతిథిగా రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, మండల అధికారులు పాల్గొనాలని తెలిపారు.

ఆచార్య ఈశ్వర్‌రెడ్డికి 'తుమ్మల' సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు ఎన్.ఈశ్వర్‌రెడ్డికి తుమ్మల సీతారామయ్య సాహితీ పురస్కారం అందిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యుదయ సాహిత్యంలో కృషిచేసే వారిని గుర్తించి ప్రతి సంవత్సరం ఒక రచయితకు ఇస్తున్నామన్నారు. 2024 సంవత్సరానికి ఆచార్య ఎన్.ఈశ్వర రెడ్డిని ఎంపిక చేసినట్టు ప్రకటించారు. ఈనెల 7 న గుంటూరు బుక్ ఫెస్టివల్‌లో భాగంగా జరుగుతున్న సాహిత్య కార్యక్రమంలో పురస్కార గ్రహీతను రూ.5 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరిస్తామని పేర్కొన్నారు.



మహాసభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ నాయకులు

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటాలు

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

ప్రతి ఒక్క విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాల సాగిస్తోందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్ నాయుడు పేర్కొన్నారు. డిసెంబర్ 21, 22వ తేదీలలో మదనపల్లెలో నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ మొదటి మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ నాయుడు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం ఎస్‌ఎఫ్‌ఐ అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. అందరికీ నాణ్యమైన విద్యను అందుబాటులో తెచ్చేందుకు చేసిన అనేక పోరాటాలను గుర్తుచేశారు. ప్రభుత్వ విద్యా పరిరక్షణ భవిష్యత్తు ఉద్యమ కార్యచరణకు ప్రణాళికలు రూపొందించేందుకు మదనపల్లి మహాసభ వేదిక కానుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు సాయి చరణ్, యుటిఎఫ్ నాయకులు గాలి రవీంద్ర, సురేంద్ర, చలపతి, నాగరాజు, వరప్రసాద్, రామచంద్ర, ముబారక్ పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరిపించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె తహశీల్దారు కార్యాలయ ఘటనలో వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పోతుగాళ్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ తహశీల్దారు అవినీతికి పాల్పడుతున్నారని ఎమ్మెల్యే, మదనపల్లెలో పనిచేయాలంటే రూ.30 లక్షలు ఇవ్వాలని ఎమ్మెల్యే ఒత్తిడి చేస్తున్నారని తహశీల్దారు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నట్లు వారం రోజులుగా ప్రచారం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు చెప్పకుండా కొన్ని మ్యూటేషన్లు చేసినందుకు తహశీల్దారును విధులకు హాజరు కావొద్దని ఎమ్మెల్యే ఆక్షేపించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. మాజీ ఎమ్మెల్సీకి చెందిన భూమిని మ్యూటేషన్ చేసేందుకు తహశీల్దారు డబ్బులు అడిగారన్న చర్చ జరుగుతోందని తెలిపారు. తనను పనిచేయనీకుండా డబ్బులు ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్ చేస్తున్నట్లు తహశీల్దారు మంత్రి లోకేష్‌ను కలిసి విన్నవించినట్లు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. ఈ విషయాల పట్ల ప్రజల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రెవెన్యూ అధికారులపై గౌరవం దెబ్బతింటోందని తెలిపారు. కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను బహిర్గతం చేయాలని కోరామన్నారు.



వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాన్ని అందిస్తున్న దాతలు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రామాపురం

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటి ఎన్‌జిఒ కాలనీలో నివాసమున్న ఫాఖైర్‌సాబ్ కుమారుడు షేక్.బాబాజీ ఆర్థిక సాయంతో గురువారం ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహిం చిన్నట్లు లయన్స్ క్లబ్ రాయచోటి శాఖ అధ్యక్షులు పి.శివారెడ్డి తెలిపారు. అనంతరం దాత బాబాజీ మాట్లాడుతూ తన వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే ప్రేమాలయం వృద్ధాశ్ర మంలో అన్నదాన కార్యక్రమం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్, ప్రతాప్‌రెడ్డి, నందని ట్రావెల్స్ నాయక్, దాత కుటుంబ సభ్యులు ఫాఖైర్‌సాబ్, వృద్ధాశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి-రామాపురం

పొలం వద్ద విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి చెందినట్లు రామాపురం ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని కసిరెడ్డిగారి పంచాయతీ కొత్తపల్లి చెందిన బినాతి మోహన్(48) అనే రైతు గురువారం తెల్లవారుజామున తన పంట పొలం వద్ద మోటర్ వేయడానికి వెళ్లి కిందపడిన విద్యుత్ తీగను తొక్కడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందిన వెంటనే తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

సిఐగా జీవన్ గంగానాథ్‌బాబు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట



బి.కొత్తకోట పోలీసు స్టేషన్ సిఐగా జి.జీవన్ గంగా నాథ్ బాబు నియమితులయ్యారు. గురువారం ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సిఐ రాజారెడ్డి బదిలీ అయ్యారు.ఆయన స్థానంలో రెగ్యు లర్ సిఐగా జి.జీవన్ గంగానాథ్‌బాబును నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. పట్టణం కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉండటం వల్ల ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలు, నేరాలపై ఉక్కుపాదం మోపు తామని అన్నారు.

పిటిఎం ఎస్ఐగా రవికుమార్..



బి.కొత్తకోట : మదనపల్లె టూటౌన్ పోలీసు స్టేషనులో విధులు నిర్వహిస్తున్న రవికుమార్ సాధారణ బదిలీల్లో భాగంగా పెద్దతిప్పసముద్రం పోలీసు స్టేషనులో గురువారం ఎస్.ఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నరసిం హుడు ములకలచెరువు ఎస్ఐగా బదిలీ అయ్యారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించడంతో మండలంపై ప్రత్యేక పట్టు ఉందని ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఏదైనా సమస్యలో ఉంటే నేరుగా పోలీస్ స్టేషనుకి వచ్చి ఫిర్యాదు చేయాలని అన్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా,పేకాట, బెల్ట్ షాపులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. నూతన ఎస్ఐకి పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



బాధితులకు సిఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న సుబ్రమణ్యం

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-సుండుపల్లి: సిఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిందని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి సుగవాసి బాల సుబ్రమణ్యం పేర్కొన్నారు. మండలంలోని రెడ్డివారిపల్లి గ్రామానికి చెందిన కంచం వెంకటరమణకు రూ.3,38,757లు సిఎం సహాయ నిధి చెక్కును అందించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా సమస్యలు త్వరగతిన పరిష్కరిస్తూ, ప్రజలకు అన్ని విధాలుగా సహా య సహకారాలు అందిస్తోందని అన్నారు. గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధిని పక్కనపెట్టి పేదలకు అన్యాయం చేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా నిరుపేద కుటుంబాలకు అండగా ఉందని అన్నా రు. అర్హులైన బాధితులు సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

బిసి కులాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ రాష్ట్రంలోని బిసి కులాలను ఆదుకోవాలని టిడిపి నాయి బ్రాహ్మణ కడప పార్లమెంట్ అధ్యక్షుడు గజ్జల గోవిందు కోరారు. గురువారం మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యాలయంలో ముఖ్య మంత్రి చంద్రబాబును కలిసి బిసి కులాల సమస్యలపై వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా గజ్జల గోవిందు మాట్లాడుతూ జమ్మల మడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్ల మెంట్ పరిధిలోని బిసి కులాల సమస్యలను సీఎం దృష్టికి తీసుకు పోయామన్నారు. బిసి కులాలకు ఆదరణ పథకం కింద పనిముట్లు, బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలను అందించాలన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి బిసి సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు.

బడ్జెట్ కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి - వేంపల్లె ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.270 కోట్లు కేటాయించడం హర్షణీయమని జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు పీవీఎస్‌వి ప్రసాదరావు పేర్కొన్నారు. బడ్జెట్‌లో వివిధ కార్పొరేషన్లకు కేటాయింపులతోపాటు మంత్రి సవిత బ్రాహ్మణ కార్పొరేషన్‌కు కేటాయింపులను ప్రకటించడంతో అనుమానాలు తొలగి పోయాయని తెలిపారు.

రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి

- సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని రెవిన్యూ కార్యాలయాన్ని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వేయర్లు, విఆర్ఒలతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ ధనుంజయులు నుంచి రెవెన్యూ రికార్డుల నిర్వహణపై, ప్రజల సమస్యల పరిష్కారంకు తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. రెవెన్యూ సమస్యలపై ప్రజలనుంచి అందిన ఫిర్యాదులపై ఆరా తీశారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజలు వివిధ సమస్యలతో కార్యాలయానికి వస్తుంటారని రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి తగిన న్యాయం చేయాలన్నారు. శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రజలు తమ సమస్యలను రెవెన్యూ సదస్సులో నేరుగా పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో రెవెన్యూ శాఖకు పూర్వ వైభవం తీసుకురావాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.



తాహశీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

భూ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



రైల్వేకోడూరు : నేల దినోత్సవంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

భూ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.కవిత పేర్కొ న్నారు. ప్రపంచ నేల దినోత్సవం రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఎపిసిఎన్‌ఎఫ్ రైతులకు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రతి రైతుకు మానవ మనుగడకు భూమిని పరిరక్షిం చుటకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. విచక్షణ రహితంగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమి నిస్సారం కావడమే కాక నేలకు మేలు చేసే సూక్ష్మజీవులు, వాన పాములు నశించి భూమి వ్యవసాయనికి పనికి రాకుండా పోతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం విధానాల ద్వారా నేలను కాపాడ వచ్చునని తెలిపారు. ఎఒ జి.సుధాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భూసార పరీక్షలు చేసుకొని ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని కోరారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండలంలోని వత్తలూరు గ్రామ సచివాలయంలో మండల వ్యవసాయ అధికారి శ్రీకర్, పంచాయతీ సెక్రెటరీ ఆధ్వర్యంలో రైతులకు నేల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు.వారి పొలంలో మట్టి పరీక్షలు జరిపిన పత్రాలను మండల వ్యవసాయ అధికారి చేతుల మీదుగా రైతులకు అందిచారు. రైతులకి వారి సొంత పొలంలో మట్టి నమూనా సేకరించడం ఎలా డెమో చేసి చూపించారు. ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి పి.మస్తాన్ మాట్లాడుతూ మట్టిని కాపాడుకోవాలంటే పకృతి వ్యవసాయం చేయడం వలన సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రవీణ్ కుమార్, దిలీప్ కుమార్, లక్ష్మీదేవి, ఉదయభాను, పకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **కలికిరి :** కెవికె కృషి విజ్ఞాన కేంద్రంలో పపంచ నేలల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.మంజుల ప్రపంచ మట్టి దినోత్సవంను 2013 నుంచి ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ సహకారంతో, ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ సాయిల్ సైన్స్ నిర్వహిస్తుందని తెలిపారు. మట్టి సమస్త ప్రాణులకు ఆధారమని, నేల నుంచే వివిధ రకాల మొక్కలు, జంతువులు, సూక్ష్మజీవులు పోషకాలను అందుకుంటాయని అన్నారు.కృత్రిమ మందులతో కలుషితం చేయకుండా, పద్ధతులు పాటించి నేల స్వభావాన్ని కాపాడాల్సిన ఆవశ్యకతను వివరించారు. జిల్లా వనరుల కేంద్రం, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శ్రీ అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుకు నేస్తమైన వానపాముల జాతిని సంరక్షించాలని, సేంద్రియ పద్ధతులైన పచ్చిరొట్ట ఎరువులు వాడాలని, వర్మీ కంపోస్టు తయారీ చేపట్టాలని సూచించారు. కలికిరి ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి, నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పంట మార్పిడి, పంటవిడిది మొదలగు అంశాలు మంచి దిగుబడులు తీసుకోవడానికి దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పీరుసా హెబ్, డాక్టర్ మాధురి, కెవికె సిబ్బంది అధికారులు, రైతులు పాల్గొన్నారు.



పుల్లంపేట : మట్టి పరీక్షలను చేసి చూపిస్తున్న ఎఒ శ్రీకర్

విభిన్న ప్రతిభావంతులకు చేయూతనందించాలి



పీలేరు: బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

ప్రజాశక్తి-పీలేరు

అంగవైకల్యం పిల్లల అభివృద్ధికి అడ్డు కాకూడదని, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు సమ సమాజ నిర్మాతలుగా ఎదగాలని ఎంపిడిఒ శివశంకర్ తెలిపారు. పీలేరు మండల కార్యాలయం ఆవరణంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతులదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులనుప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా ప్రభుత్వం గుర్తించి, వీరికి అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం వీరిలోని నైపుణ్యాలను, ఆసక్తికర రంగాలను గుర్తించి ప్రోత్సాహాన్ని అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయులు లలిత కుమారి, ధరణిజ, సుబ్రహ్మణ్యం, సి.ఆర్.పిలు మురళీధర్ రాజు, నాగరాజ, అశోక్, మాధవి, ఆయా శైలజ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. **రామాపురం :** మండల కేంద్రం రామాపురంలో భవిత కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమంలో ఎంఇఒ రామకృష్ణుడు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో నేటికీ దివ్యాంగులపై చిన్న చూపు చూస్తుంటారని అటువంటి పద్ధతులను మానుకోవాలన్నారు. ఎంఇఒ-2 జయచంద్ర మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుగల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యా యులు రవీంద్రనాథ్, భవిత కేంద్రం ఐఇఆర్‌టిలు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **కలకడ :** మండల కేంద్రమైన కలకడలో ఉన్న భవిత పాఠశాలలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఐఇఆర్‌టి ఉపాధ్యాయులు లక్ష్మీనరసమ్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారులు మునీంద్ర నాయక్, రామచంద్రారెడ్డి, ప్రాథమిక పాఠశాల తెలుగు, ఉర్దూ ప్రధాన ఉపాధ్యాయులు పద్మావతి, షర్ఫునీసా పాల్గొన్నారు. ఆర్‌పిడి 2016 చట్టం వల్ల కలిగే ప్రయోజనాలను అన్నింటిని, పాఠశాలలో చేసిన తర్వాత విభిన్న ప్రతిభావంతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. **నిమ్మనపల్లె :** విభిన్న ప్రతిభావంతుల్లోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి, వారి ఉన్నత భవిష్యత్తుకు చేయూతనందిం చాలని ఎంఇఒ నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినో త్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో కూడా ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, ఉపాధ్యాయులు వారిలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి, ప్రోత్సహిస్తూ వారి ఉన్నత భవిష్యత్తుకు దోహదపడాలని అన్నారు. సమగ్ర శిక్ష ద్వారా అమ లవుతున్న ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ లను సమర్ధవంతంగా అందిస్తూ, ప్రత్యేక విద్యా రాయితీలను వారు సద్వినియోగం చేసుకునేలా చూడా లన్నారు.పిల్లలకు ఆట పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు సురేష్, ప్రదీప, ప్రధానోపాధ్యాయులు సుజాత, కేర్ టేకర్ న్యామత్, ఎంఆర్‌సి సిబ్బంది నరసింహులు, సౌజన్య, సుబ్బయ్య పాల్గొన్నారు.

సేవా సంఘం సభ్యులకు ప్రశంసా పత్రాలు

పుల్లంపేట : ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంచాలకులు కృష్ణ కిషోర్ చేతుల మీదుగా పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవ సంఘం అధ్యక్షులు మల్లు సుబ్బనర్సారెడ్డి ప్రశంసా పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు అన్నం చిన్నసుబ్బయ్య యాదవ్, సూపరిండెంట్ అనిల్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ప్రశంసా పత్రం అందుకోవడంతో తనపై మరింత బాధ్య తను పెంచిందని విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ అన్నారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా న్యూ ఆంధ్ర కల్యాణమండపంలో జరిగిన మహెూత్సవంలో ఉమ్మడి జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంచాలకులు కృష్ణ కిషోర్ చేతులమీదుగా అబ్దుల్ ఖాదర్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్య క్షులు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్, సూపరిండెంట్ అనిల్ పాల్గొ న్నారు.

సామాజిక సేవకు పురస్కారాలు

రైల్వేకోడూరు : పోరుమామిళ్ల బ్లెస్సెడ్ బ్రయాన్ అనాథశ్రమంలో మదర్ థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, చిత్తా విజయప్రతాప్‌రెడ్డి చేతులమీదుగా మదర్‌థెరిసా సేవా రత్న అవార్డు ను స్థానిక గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారధి అందుకున్నారు. **మదనపల్లె అర్బన్ :**చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు ఎంపీ ఆనందన్‌ను మదర్ థెరిసా సేవా రత్న పురస్కారం వరించింది. ప్రపంచ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా మదర్ థెరిసా సేవా పురస్కారం అందుకున్నారు. అవార్డు ప్రదానం చేసిన చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి, చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, చిత్తా గిరి ప్రణీత్‌రెడ్డికి, మదర్ థెరిస్సా ఫౌండేషన్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

సాంకేతిక విద్యతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు

-ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

సాంకేతిక విద్యతోనే యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పాలిటెక్ ఫెస్ట్-2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. మొదటి రోజు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కు మార్‌రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రోజు రోజుకి దేశం సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నదని, సాంకేతిక రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. దానికి తగ్గట్లు విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసించి మెరుగైన ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. పేద విద్యార్థులకు సైతం మెరుగైన విద్యను అందుబాటులో తేవడానికి కలికిరిలో సైనిక్ స్కూల్, జెఎన్‌టియు, అగ్రికల్చర్ హార్టికల్చర్ డిప్లమో ఇన్ పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఈ కళాశాలలో మరిన్ని కోర్సులు విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చి, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి మరిన్ని సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే పదవి అలంకారంగా కాకుండా ప్రజాసేవ చేయడానికి అని, పదవి ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల్లో ఉంటానని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మేక్ ఇన్‌ఇండియా నినాదంతో యువత సృజనాత్మకతను వెలికి తీసి ప్రపంచ స్థాయి ఆవిష్కరణలను అందించడానికి పాలిటెక్ ఫెస్ట్ రెండవ దశను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫెస్ట్ కార్యక్రమానికి జిల్లాలోని 20 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని వారు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రజెంటేషన్ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో యం. శివరామక్రిష్ణ, ఇసిఇ. విభాగా ధిపతి, బి.సాంబశివా రెడ్డి, ఇఇఇ. విభాగాధిపతి, డాక్టర్ పి.రఘు, జనరల్ సెక్షన్ విభాగాధిపతి, కళాశాల సిబ్బంది, వివిధ కళాశాల నుండి వచ్చిన విద్యార్థులు, పంచాయతీ ఇఒ అశోక్, నాయకులు ఎర్రంరెడ్డి, సహదేవ రెడ్డి, ధరణి సత్యారెడ్డి, ఇండియన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ఆదినారాయణరెడ్డి, అగస్త్యేశ్వర్, రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి



పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రశాంతంగా రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే గ్రంథాలయంలో రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు రెండో రోజూ గురువారం ప్రశాంతంగా జరిగాయి. 391 మంది రైల్వే కార్మిక ఓటర్లు ఈ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. శుక్రవారం కూడా ఈ ఎన్నికలు జరగనున్నాయి. మొదటిరోజు 214, రెండవ రోజున 107 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలకు పోలింగ్ అధికారిగా మధుసూదన్ రావు, పోలింగ్ సూపరిండెంట్ శివలింగం, పోలింగ్ అసిస్టెంట్ గా లక్ష్మి నారాయణ వ్యవహరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ భాస్కరరావు, స్థానిక ఎఎస్ఐ శంకర్ నాయక్, జిఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ సుభాన్, జిఆర్‌పి పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 17 రైల్వే జోన్లలో జరిగే ఎన్నికలలో 5 కార్మిక సంఘాలు పాల్గొంటున్నాయి.35 శాతం ఓట్లు వచ్చిన యూనియన్లకు గుర్తింపు లభించనుంది.

వర్మీ కంపోస్టుపై శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

వర్మీకంపోస్టుపై గ్రామీణ యువతకు కృషి విజ్ఞాన కేంద్రంలో కలికిరిలో వారంరోజుల పాటు వృతి నైపుణ్య శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.మంజుల తెలిపారు. ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, రసాయన రహిత ఆహార పదార్థాలకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో సేంద్రియ వ్యవసాయంలో కీలకమైన వర్మి కంపోస్టు తయారీపై శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభించారు. అధునిక వ్యవసాయ విధానంలో రసాయనిక ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగి భూసారం క్షీణిస్తుండడంతో పాటు వాతావరణ కాలుష్యం పెరగడం వల్ల, ఆహార పదార్థలలో పురుగు మందుల అవశేషాలు ఎక్కువగా వుండటం కేన్సర్ బారిన పడుతున్నట్లు తెలిపారు. సేంద్రియ వ్యవసాయంలో ప్రధానమైన వర్మి కంపోస్టుతో యువత, ఔత్సాహిక రైతులు ఉపాధి పొందే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో ఈ కార్యక్రమం చాలా ఉపయోగ పడుతుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు అశోక కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకు జరుగుతుందని, 18 నుంచి 40 ఏళ్ల వయస్సు వారు పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో నాణ్యతగల వానపాముల ఎరువుతయారీ విధానం, వాడుక, వర్మి కంపోస్టులోని పోషక విలువలు, వ్యర్థాల పునః విని యోగం, తదితర అంశాలపై నిపుణులు ఏడు రోజుల పాటు శిక్షణ ఇస్తారని వివరిం చారు. ఈ కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన వారికి కృషి విజ్ఞాన కేంద్రం, ఆత్మ ద్వారా జారీ చేసిన సర్టిఫికేట్ అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేతలు, సిబ్బంది, గ్రామీణ యువత పాల్గొన్నారు.

అసెంబ్లీకి వెళ్లకపోతే ఇంటి దగ్గర ధర్నా చేస్తాం

- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాజీ ముఖ్య మంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీకి రాకపోతే ఆయన ఇంటి వద్ద ప్రజలతో కలిసి ధర్నా చేస్తామని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల సమస్యలపై పోరాటం చేయకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై పోరాడుతారని పులివెందుల ప్రజలు వైఎస్ జగన్‌ను 62 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించారన్నారు. పులివెందుల ప్రాంత ప్రజల సమస్యలను అసెంబ్లీలో నిలదీయకుండా ఇంటి వద్దనే ఉండడం దారుణ మన్నారు. రాష్ట్రంలో పంటల బీమాను భ్రష్టు పట్టించింది వైసిపి ప్రభుత్వ మేనన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఇప్పటికే కొన్ని పథకాలను అమలు చేశారని, త్వరలోనే అమ్మకు వందనం కూడా అమలు చేస్తామన్నారు. పులివెందుల మెడికల్ కళాశాల నిర్మాణంపై వైసిపి నాయకులు ఇప్పుడు ఏదో రాద్ధాంతం చేస్తున్నారని, గత అయిదేళ్లల్లో మెడికల్ కళాశాలను ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలన్నారు. పాడా ద్వారా పులివెందులలో వందల కోట్లు ఖర్చు చేసినా అభివృద్ధి మాత్రం జరగలేదన్నారు. ఇప్పటికైనా పులివెందులపై అభిమానం ఉంటే సమస్యలపై పోరాడాలని, లేకపోతే రాజీనామా చేస్తే ఈ ప్రాంత ప్రజలు కొత్త ఎమ్మెల్యేను ఎన్నుకొని వారి ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటారన్నారు.

క్రైం కార్నర్



తహశీల్దార్ ఎదుట నిందితులను హాజరు పరిచిన ఎస్ఐ

లాటరీ విక్రయదారుల బైండోవర్

ప్రజాశక్తి-పీలేరు

ఏడుగురు లాటరీ విక్రయదారులను తహశీల్దార్ ఎం. భీమేశ్వరరావు ఎదుట బైండోవర్ చేసినట్లు పీలేరు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక పోలీసులకు అందిన రహస్య సమాచారం మేరకు ఎస్ఐ తనిఖీలు నిర్వహించి, లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.53,750 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం వారిని మండల మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

మండల పరిధిలోని కొండ్లోపల్లె గ్రామంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్ ఫార్మర్‌లోని రాగి వైరు చోరీ చేశారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు..ఊటుకూరు గ్రామపంచాయతీ కొండ్లోపల్లికు చెందిన కె.రత్నమ్మకు చెందిన పొలంలో వ్యవసాయ అవసరాల కొరకు ఏర్పాటు చేసు కున్న 25 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోని రాగి వైరును చోరీ చేశారని తెలి పారు. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం కావడంతో వ్యవసాయంపై ఆధారపడి జీవించే తాము నిరాశ్రయులమయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన ఘటనపై రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. విద్యుత్ శాఖకు ఫిర్యాదు చేస్తే వారి తరపున తాము ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేస్తామని పోలీసులు చెప్పారని తెలి పారు. విద్యుత్ శాఖతోపాటు పోలీసు అధికారులు స్పందించి తమ జీవనాధారమైన ట్రాన్స్‌ఫార్మర్ చోరీ చేసిన నిందితులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు.